క్లుప్తంగా

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

మంత్రాలయం రూరల్: సైబర్ నేరాల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మంత్రాలయం ఎస్ఐ వేణుగోపాల్‌రాజు సూచించారు. ఆయన బుధవారం రాత్రి వగరూరులో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ద్విచక్ర వాహనాలు, కారు, ఆటోల్లో ప్రయాణించే సమయంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించడంతో పాటు రికార్డులను సక్రమంగా ఉంచుకోవాలన్నారు. ఎవరైనా కర్ణాటక మద్యం అమ్మకాలకు పాల్పడితే జైలుకు వెళ్లడం ఖాయమని హెచ్చరించారు.

లారీ సీజ్



లారీని సీజ్ చేసిన వన్‌టౌన్ ఎస్ఐ ప్రహ్లాద్

ఆదోని అర్బన్: పట్టణంలోని ఓ ఆయిల్ ఫ్యాక్టరీ నుంచి వ్యర్థ పదార్థాలను తరలిస్తున్న ట్యాంకర్ లారీని రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులు సీజ్ చేశారు. ఆదోని వన్‌టౌన్ ఎస్ఐ ప్రహ్లాద్ తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని ఐకే ఆయిల్ ఫ్యాక్టరీ నుంచి వ్యర్థ పదార్థాలను ప్రతిరోజూ ట్యాంకర్ లారీలో తరలించి రాయ్‌నగర్ కాలనీ సమీపంలోని చెరువులో అన్‌లోడ్ చేస్తున్నారు. దీంతో బుధవారం కాలనీవాసులు కాపుగాసి లారీని పట్టుకుని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఆ ప్రాంతానికి వెళ్లగా డ్రైవర్ తప్పించుకుని ట్యాంకర్ లారీని ఫ్యాక్టరీలోకి తీసుకెళ్లి గేటుకు తాళం వేశాడు. లారీని వెంబడించి ఫ్యాక్టరీ వద్దకు వెళ్లి సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. వెంటనే రెవెన్యూ శాఖ అధికారులను పిలిపించి ట్యాంకర్ లారీని అప్పగించినట్లు చెప్పారు.

వైఎస్సార్ బీమా పేదలకు వరం



బీమా తక్షణ సాయం అందిస్తున్న దృశ్యం

కౌతాళం: వైఎస్సార్ బీమా పేదలకు వరం లాంటిదని ఉరుకుంద యువజన నాయకులు డానియల్, భాస్కర్ అన్నారు. మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో హరిజన రాజన్న అనారోగ్యంతో మృతి చెందడంతో వైఎస్సార్ బీమా నామినీగా ఉన్న భార్య భాగ్యమ్మకు ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు రూ.10 వేల ఆర్థిక సాయం వెల్ఫేర్ అసిస్టెంట్ దివ్య, ఉరుకుంద ట్రస్టు బోర్డు చైర్మన్ నాగరాజ్ గౌడ్ యూత్ సభ్యులతో కలిసి అందజేశారు. మిగతా సొమ్ము త్వరలో నామినీ బ్యాంకు ఖాతాలో జమ అవుతుందన్నారు.

యువకుడికి తీవ్రగాయాలు

వెల్దుర్తి: బ్రహ్మగుండం రోడ్డులో ఇటుకల బట్టీల టర్నింగ్ వద్ద కారు, బైక్ ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో వెల్దుర్తిలోని రాణితోట యువకుడు దాసరి కిశోర్ గాయపడ్డాడు. బ్రహ్మగుండంలో శివరాత్రి ఉత్సవాలకు బొమ్మల అంగడి ఏర్పాటు చేసేందుకు కిశోర్ తన కుటుంబానికి సహకరించి తిరిగి వెల్దుర్తికి బైక్‌పై వస్తుండగా కారు ఢీకొట్టింది. కిశోర్ తీవ్రగాయాలపాలై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. క్షతగాత్రుడిని 108 వాహనంలో కర్నూలు ఆసుపత్రికి తరలించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆలూరు: కర్ణాటక మద్యాన్ని గుట్టుగా బైక్‌లపై ఆంధ్రాకు సరఫరా చేస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసి 3 బాక్సుల మద్యం, రెండు బైక్‌లను సీజ్ చేసినట్లు ఆలూరు సెబ్ సీఐ ఎర్రవెంకట్ బుధవారం తెలిపారు. హాలహర్వి మండలం మాచనూరుకు చెందిన నాగరాజు 2 బాక్సులు, ఎంకే పల్లి గ్రామానికి చెందిన పెద్దహనుమంతు ఒక బాక్స్ మద్యంను బైక్‌లపై తరలిస్తుండగా క్షేత్రగుడి చెక్‌పోస్టు వద్ద పట్టుబడినట్లు చెప్పారు. నిందితులను అరెస్ట్ చేసి రెండు బైక్‌లను సీజ్ చేసినట్లు తెలిపారు.

వైభవంగా బండేగురువుల ప్రభోత్సవం

నందవరం: మండలంలోని పూలచింత గ్రామంలో వెలసిన సద్గురు శ్రీ వరబండేగురుస్వాముల జాతర మహోత్సావాలలో భాగంగా మఠం పీఠాధిపతి శంకరప్ప స్వామి, ఉప పీఠాధిపతి బండేగురుస్వామి ఆధ్వర్యంలో బుధవారం అశేష జనవాహిని మధ్య ప్రభోత్సవం అత్యంత రమణీయంగా సాగింది. బుధవారం ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు చేపట్టి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం పూలమాలు, పుష్పాలతో విశేషాలంకారణ గావించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. మధ్యాహ్నం సద్గురువుకు పల్లకి సేవ, నందికోలు సేవ, శ్రీవారి మూలస్థానానికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేపట్టారు. పీఠాధిపతి శంకరప్ప స్వామికి కర్ణాటక భక్తులు నాణేలతో తులాభారం చేపట్టారు. సాయంత్రం పల్లకి సేవలో స్వామివారిని పురవీధుల్లో ఊరేగింపుగా తీకెళ్లారు. అనంతరం భక్తుల జయజయ ధ్వానాల మధ్య స్వామి వారి రథచక్రాలు ముందుకు సాగాయి. డోలు, సన్నాయిలు, బ్యాండు మేళాలు మధ్య ప్రభోత్సవం వైభవంగా సాగింది. స్వామి మఠం నుంచి రథాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి తిరిగి యథాస్థానానికి చేర్చారు. సర్పంచ్ అక్కమహాదేవి, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా తొంటధార్య స్వామి జాతర



పూజలందుకుంటున్న తొంటధార్య స్వామి ములవిరాట్



రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

కౌతాళం: మండల పరిధిలోని నదిచాగి గ్రామంలో వెలసిన తొంటధార్య స్వాముల జాతర మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. గత నాలుగు రోజులు నుంచి ప్రవచనలు చేశారు. బుధవారం తెల్లవారుజామున ప్రత్యేక పూజలు సుప్రభాత సేవ, మహామంగళహారతి పూజల అనంతరం భక్తులను దర్శనానికి వదిలారు. జిల్లా నలుమూలల నుంచే గాక కర్ణాటక నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం గ్రామ పుర వీధుల గుండా స్వామి రథోత్సవం అంగరంగ వైభవంగా భక్తుల కోలాహలం మధ్య సాగింది. వేలాదిగా తరలివచ్చిన భక్తుల మధ్య రాత్రి వరకు రథోత్సవం కొనసాగింది. మఠం పీఠాదిపతలు సిద్దలింగమహా స్వామి, బసవలింగ స్వామి, ఆదోని మఠం స్వామి సిద్ద దేవర స్వామి, వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ రుద్రగౌడ్, కొట్టూరు మఠం బసవలింగ మహాస్వామి, సంతెకెల్లూరు మఠం స్వామి గురుబసవ మహాస్వామి, ఎద్దులదొడ్డి మఠం మహాలింగస్వాములు పాల్గొన్నారు.

మారికాంబా దేవి దేవర



కుంభాలతో తరలివస్తున్న మహిళలు,(ఇన్‌సెట్) పూజలందుకుంటున్న మారికాంబా దేవి

కౌతాళం: మండల పరిధిలో డంబలదిన్నెలో బుధవారం గ్రామ దేవత మారికాంబా దేవి దేవర వైభవంగా నిర్వహించారు. భక్తులు తెల్లవారుజాము నుంచే అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచే దేవతా మూర్తికి గ్రామస్తులు కుంభాలతో నైవేద్యాలను సమర్పించారు. గ్రామంలోని దేవాలయాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఉదయం నుంచి కుంభలాతో మహిళలు వందలాదిగా తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవర సందర్భంగా ప్రతి ఇళ్లు బంధుమిత్రులతో కిటకిటలాడింది.

అమ్మవారిని దర్శించుకున్న ప్రదీప్‌రెడ్డి

దేవర సందర్భంగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన నాయకుడు ప్రదీప్‌రెడ్డి మారికాంబా దేవిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వీరికి గ్రామ నాయకుడు కుమార్‌గౌడ్ ఇతర నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారెమ్మవ్వ ఆశీర్వాదం అందరికీ ఉండాలని కోరారు. వీరి వెంట బాపురం యువజన నాయకుడు గురునాథ్‌రెడ్డి, ఏకాంబర్ రెడ్డి, ప్రహ్లాదచారి, పాండురంగారెడ్డి తదితరులు ఉన్నారు.

రైల్వే గేటు వద్ద నిలిచిపోయిన గూడ్స్ రైలు



గేటు వద్ద నిలిచిపోయిన వాహనాలు

- 40 నిమిషాల పాటు గేటు మూసివేత
- ఇబ్బందులు పడ్డ వాహదారులు, ప్రయాణికులు

కోసిగి: స్థానిక రైల్వే గేటు వద్ద గూడ్స్ రైలు నిలిచిపోవడంతో దాదాపు 40 నిమిశాల పాటు వాహనదారులు ఎండలో ఇబ్బందులు పడ్డారు. ముంబై నుంచి చెన్నై ప్రధాన రైల్వే మార్గం కావడంతో బుధవారం గూడ్స్ రైలు కోసిగి మీదుగా ఆదోని వైపు వెళుతోంది. అదే సమయంలో ముంబై – చెన్నైకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు సిగ్నల్ పడింది. ముందుగా వెళుతున్న గూడ్స్ రైలును కోసిగి స్టేషన్‌లో నిలిపి వేసేందుకు రెడ్ సిగ్నల్ ఇచ్చారు. దీంతో గూడ్స్ ఇంజిన్ వేగం తగ్గించి వస్తూ గేటు వద్దే నిలిచిపోయింది. అధిక లోడ్‌తో ఉన్న గూడ్స్ రైలు ముందుకు సాగక సిగ్నల్ క్రాస్ చేసేందుకు దాదాపు 40 నిమిషాలకు పైగా సమయం పట్టింది. దీంతో గేటు వద్ద రెండువైపులా బస్సులు, లారీలు, వాహనాలు, స్కూటర్లు బారులు తీరాయి. ఎండకు వేచిఉండలేక ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. గేటు తెరిచిన తర్వాత వాహన రాకపోకలతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. వాహనాలన్నీ గేటు దాటక ముందే మంత్రాలయం నుంచి చెన్నై మెయిల్ ఎక్స్‌ప్రెస్ రైలుకు సిగ్నల్ పడింది. మరోసారి గేటు వేయాల్సి వచ్చింది. కొందరు వాహనదారులు, బాటచారులు గేటు దాటినా పట్టాల పక్కనున్న ఖాళీ స్థలంలో నిలిచిపోయారు. ఇలాంటి ఘటనల వల్ల ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశాలు ఉన్నాయని పలువురు ప్రయాణికులు, రైల్వే అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. చెన్నై- ముంబై ప్రధాన రైలు మార్గం కావడంతో పది నిమిషాకోసారి గేటు పడుతోందని, గేటు పడిన ప్రతిసారి 15 నుంచి 20 నిమిషాలకు పైగా ఆగాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోయారు. రైల్వే అధికారులు స్పందించి వాహనాలు రాకపోకలు సాగించేందుకు ప్రత్యామ్నాయ మార్గం చూపాలని కోరుతున్నారు

కోలుకోలేక వ్యక్తి మృతి



బోయ లక్ష్మయ్య (ఫైల్)

ఆదోని రూరల్: మండలంలోని బల్లేకల్ క్రాస్‌రోడ్డు వద్ద మంగళవారం రెండు స్కూటర్లు ఢీకొన్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బోయ లక్ష్మయ్య (45) చికిత్స పొందుతూ కోలుకోలేక బుధవారం మృతి చెందాడు. ప్రమాదంలో బోయ లక్ష్మయ్య, ఈడిగ వీరేష్ (30) తీవ్రంగా గాయపడ్డారు. వీరేష్ ఆదోనిలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి విషమంగా ఉన్న బోయ లక్ష్మయ్యను కర్నూలుకు రెఫర్ చేయగా కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక బుధవారం మృతి చెందినట్లు పెద్దతుంబళం ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. మృతదేహాన్ని ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. మృతుడికి భార్య హనుమంతమ్మ, కుమారుడు హనుమంత, కుమార్తె అనిత ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ



ఆలయ ముఖద్వారాన్ని ప్రాంభిస్తున్న జయమనోజ్ రెడ్డి

ఆదోని రూరల్: మండలంలోని సలకలకొండ గ్రామంలో బుధవారం శ్రీకృష్ణ దేవాలయానికి ముఖద్వారం, నూతన ధ్వజస్తంభ కలశ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు జరిగాయి. వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు జయమనోజ్ రెడ్డి పాల్గొని ప్రారంభించారు. గత రెండు రోజులుగా గ్రామంలో హోమాలు, ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో జయమనోజ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయం వెలుపల రూ.3 లక్షల వ్యయంతో 25 అడుగుల ధ్వజస్తంభం ఏర్పాటు చేసేందుకు దాత రేణుమేకల హుసేనప్ప సహకారం అందించాడన్నారు. అలాగే రూ.8 లక్షల వ్యయంతో 11 కలశాలతో ముఖద్వారం ఏర్పాటుకు విరాళం అందించిన మునెమ్మగారి చిన్న వెంకటరెడ్డి కుమారుడు నరసింహారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. దాతల సహకారంతో గ్రామస్తులు దేవాలయాలను అభివృద్ధి చేసుకోవడం హర్షించదగ్గ విషయమన్నారు. సర్పంచ్ రాఘవేంద్ర, మాజీ సర్పంచ్ మల్లికార్జున, వైఎస్సార్‌సీపీ నాయకులు సన్నీ, అలసందగుత్తి సోమశేఖర్‌రెడ్డి, రాఘవేంద్రరెడ్డి, గ్రామ నాయకులు రాముడు, ఈరన్న, గోవర్ధన్, నరసన్న, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబవుతున్న శివాలయాలు



శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబవుతున్న పులిగట్టు దేవాలయం,(ఇన్‌సెట్) రాముడు ప్రతిష్ఠించిన లింగేశ్వరుడు

కౌతాళం: మండలంలో ప్రముఖ దేవాలయాలు ఈ నెల 18 నుంచి జరిగే మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబవుతున్నాయి. ముఖ్యంగా మండల పరిధిలోని ఎరిగేరి గ్రామ పొలిమేర కొండల్లో వెలసిన పులిగట్టు ఆంజనేయస్వామి దేవాలయంలో, ఆంధ్రప్రదేశ్ ముఖద్వారం తుంగభద్ర నది ప్రవేశ ప్రాంతంలో నది ఒడ్డున మేళిగనూరు గ్రామంలో శ్రీరాముడు ప్రతిష్ఠించిన రామలింగేశ్వర స్వామి ఆలయంలో మూడు రోజుల పాటు శివరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఎరిగేరి గ్రామంలో కులమతాలకు అతీతంగా పండుగను గ్రామప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. ఈ పండుగకు 15 రోజుల ముందు నుంచే ప్రతి ఇంటికీ సున్నం, రంగులు వేసి అలంకరిస్తారు. కుటుంబసభ్యులు ఏ ప్రాంతంలో ఉన్నా ఈ పండుగకు మాత్రం తప్పకుండా స్వగ్రామానికి వచ్చి స్వామికి మొక్కుబడులు తీర్చుకుంటారు. మహాశివరాత్రి రోజు గ్రామస్తులేకాక చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కొండల్లో ఉన్న స్వామి వద్ద జాగారణ చేస్తూ మరుసటి రోజు స్వామివారికి తలనీలాలు సమర్పిస్తారు. తిరిగి స్వామివారి పల్లకీ మహోత్సవం సోమవారం రాత్రి కొండ నుంచి గ్రామానికి చేరేలోగా మంగళవారం ఉదయం 10 గంటలు అవుతుంది. ఇప్పటికే గ్రామంలో ప్రధాన వీధులన్నీ విద్యుదీపాలతో కొండ వరకు సుందరంగా అలంకరించారు.

మేళిగనూరులో ఉత్సవాలు

రావణాసురుడు సీతాదేవిని అపహరించుకుపోయిన సమయంలో సీతాదేవి కోసం వెతుకుతూ తెల్లవారుజామున తాను బసచేసిన చోట ఈశ్వరుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు చేయడం అలవాటున్న శ్రీరాముడు తుంగాతీరాన స్వయంగా శివలింగేశ్వర స్వామి విగ్రహాన్ని ఇక్కడ ప్రతిష్ఠించినట్లు చరిత్ర చెబుతోంది. దీంతో మేళిగనూరులో శివరాత్రి ఉత్సవాలకు ప్రత్యేక స్థానం ఉంది. ఇక్కడి శివున్ని పూజించేందుకు కర్ణాటక నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి ఉత్సవాల్లో పాల్గొంటారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ నిర్వాహకులు ఆయా దేవాలయాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు.

ఈరన్న స్వామికి వెండి దీపాలు విరాళం



అధికారులకు వెండి దీపాలను అందజేస్తున్న దాతలు

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి దేవాలయానికి బుధవారం భక్తులు వెండి దీపాలను విరాళం అందజేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి తెలిపారు. డోన్ వాస్తవ్యులు డాక్టర్ దీపిక, డాక్టర్ శ్రీధర్ దంపతులు 634 గ్రాముల వెండి దీపాలను దేవాలయ కార్యాలయంలో అందజేశారు. దాతలకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించి తీర్థప్రసాదాలు, పూలమాల, స్వామి వారి శేష వస్త్రాలు, లడ్డూలు, బాండును అందజేశారు. భక్తులు విరివిగా విరాళాలు అందజేసి ఆలయ అభివృద్ధికి పాటుపడాలని అసిస్టెంట్ కమిషనర్ కోరారు. ఆలయ పర్యవేక్షకుడు వెంకటేష్, సిబ్బంది ఉన్నారు.

ఘనంగా ఇస్వీ దర్గా ఉరుసు



దర్గాను పూలతో సుందరంగా అలంకరించిన దృశ్యం

ఆదోని రూరల్: మండలంలోని ఇస్వీ గ్రామంలో వెలిసిన హజరత్ సయ్యద్ హర్షావలీ ఖద్రియా, హజరత్ సయ్యద్ నూరేమహ్మద్ ఖద్రియా 99వ ఉరుసు బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. మంగళవారం దర్గా నుంచి అశ్వంపై గంధం ఉంచి గ్రామ పురవీధులగుండా ఊరేగించారు. ప్రజలు అశ్వానికి పూజలు నిర్వహించారు. అలాగే బుధవారం ఉరుసు ఉత్సవాలను చేపట్టారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు దర్గాకు చేరుకుని పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. గురువారం జియారత్ కార్యక్రమాలు ఉంటాయని దర్గా నిర్వాహకులు తెలిపారు. వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు జయమనోజ్ రెడ్డి పాల్గొని దర్గాలో ప్రత్యేక ఫాతేహా నిర్వహించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ముంబైకి చెందిన మంజూర్‌జానీ, బెంగళూరుకు చెందిన హర్షియానాజ్‌తో పాటు భక్తులు, గ్రామస్తులు, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

అన్నదమ్ములపై కుక్కల దాడి



కుక్కల దాడిలో గాయపడిన భరత్, గౌతమ్

గోనెగండ్ల: మండలంలోని ఎర్రబాడు గ్రామంలో మల్లికార్జున రెడ్డి కుమారులు భరత్, గౌతమ్ బుధవారం ఇంటి ముందు ఆడుకుంటుండగా వీధి కుక్కలు ఒక్కసారిగా దాడి చేసి గాయపరిచాయి. పిల్లలు బిగ్గరగా అరవడంతో గ్రామస్తులు కుక్కలను తరిమికొట్టారు. దీంతో చిన్నారులు ప్రాణాలతో బయటపడ్డారు. గాయపడిన చిన్నారులను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చికిత్స చేయించుకొని వస్తూ మృతి

ఆలూరు: మొలగవెల్లికి చెందిన గొల్ల బంగారి అపరాది (52) ఆరోగ్యం బాగాలేకపోవడంతో బుధ వారం ఉదయం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందాడు. ఆర్టీసీ బస్సులో ఆలూరుకు తిరిగి వస్తుండగా కరివేముల వద్ద మూత్ర విసర్జన కోసం బస్సు దిగి గుండెపోటుకు గురై అక్కడిక్కడే మృతిచెందారు. తెలిసిన వారు కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మృతదేహాన్ని గ్రామానికి తరలించారు. మృతుడికి భార్య సులోచనమ్మ, ఇద్దరు కుమారులు, ఐదుగురు కుమార్తెలు ఉన్నారు.

ముగ్గురు నిందితుల అరెస్ట్

పత్తికొండ రూరల్: అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్న కేసులో పరారీలో ఉన్న నిందితులు పెండేకల్ గ్రామానికి చెందిన శివ, ఎద్దులదొడ్డి షరీఫ్‌లను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ మురళీమోహన్ తెలిపారు. పత్తికొండ-చక్రాళ్ల రోడ్డులోని పంప్‌హౌస్ వద్ద రెండు రోజుల క్రితం పట్టుబడిన అక్రమ మద్యం కేసులో నిందితులిద్దరిని ఏఎస్ఐ జమీర్, సిబ్బందితో కలిసి దాడి చేసి పట్టుకున్నట్లు చెప్పారు. అలాగే మట్కా కేసులో పరారీలో ఉన్న జోగి ఉరుకుందును అరెస్టు చేసినట్లు తెలిపారు.

నాటుసారా స్థావరాలపై దాడులు



నాటుసారా బట్టీని ధ్వంసం చేస్తున్న సెబ్ పోలీసులు

ఆదోని రూరల్: పట్టణంలోని బాలనాగన్న చెరువు వద్ద నాటుసారా స్థావరాలపై బుధవారం ఆదోని సెబ్ పోలీసులు దాడులు నిర్వహించి పట్టణానికి చెందిన బోయ శివను అదుపులోకి తీసుకున్నట్లు సెబ్ సీఐ హరికృష్ణ తెలిపారు. మరో వ్యక్తి బోయ చిరంజీవి తప్పించుకున్నాడన్నారు. స్థావరం వద్ద 400 లీటర్ల ఊటను ధ్వంసం చేసి 5 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఎవరైనా అక్రమంగా నాటుసారా తయారు చేసినా, విక్రయించినా కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. దాడుల్లో సెబ్ ఎస్ఐ శివప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

క్రీడాకారులు సత్తా చాటాలి



క్రీడాకారులతో మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత

ఆదోని అర్బన్: క్రీడాకారులు కబడ్డీ పోటీల్లో సత్తా చాటి ఆదోనికి మంచి పేరు తేవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత సూచించారు. బుధవారం స్థానిక ఆర్ట్స్ కళాశాలలో జిల్లా పోటీలకు సిద్ధమవుతున్న క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిత్తూరు జిల్లా నగరిలో ఈనెల 21, 22, 23వ తేదీల్లో జరగబోయే ఎస్‌జీఎఫ్ అండర్-14 కబడ్డీ పోటీలకు క్రీడాకారులు వెళ్తున్నారని చెప్పారు. రాష్ట్రస్థాయిలో సత్తాచాటాలని సూచించారు. పీఈటీలు రామన్న, నరసింహరాజు, ఆనంద్, గంగాధర, బాషా, జాన్సన్ తదితరులు ఉన్నారు.

చిరుధాన్యాల ఉత్పత్తులపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న గుంటూరు విశ్వవిద్యాలయం సహాయ విస్తరణ సంచాలకులు డా. బి. ముకుందరావు

ఎమ్మిగనూరురూరల్: చిరుధాన్యాల ఉత్పత్తులపై ప్రత్యేక దృష్టి సారించాలని గుంటూరు ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సహాయ విస్తరణ సంచాలకులు డాక్టర్ బి.ముకుందరావు, నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహాయ పరిశోధన సంచాలకులు డాక్టర్ ఎన్‌సీ.వెంకటేశ్వర్లు, జిల్లా ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఎస్.సరళమ్మలు పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో (కేవీకే) సమన్వయకర్త డాక్టర్ సుజాతమ్మ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సమన్వయ సంఘం సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. కేవీకేలు, ఏరువాక కేంద్రాలు చిరుధాన్యాల ఉత్పత్తులపై ప్రదర్శన క్షేత్రాలు, శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసి వాటి ఉత్పత్తులను పెంచేవిధంగా చూడాలన్నారు. వ్యవసాయంలో డ్రోన్ల వినియోగంపై శిక్షణ ఇస్తున్నామని, గ్రామీణ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. మిరప, కంది పంటల్లో వచ్చే వైరస్, తెగుళ్ల నివారణకు సస్యరక్షణ పద్ధతులను వివరించారు. నాబార్డు జిల్లా మేనేజర్ పార్థీవ, జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ఏడీఏ వెంకటేశ్వర్లు, శాస్త్రవేత్తలు, అధికారులు జె.సహదేవరెడ్డి, ప్రసన్న రాజేష్, ధనలక్ష్మీ, సతీష్, ప్రసాద్‌బాబు, శ్రావణి, శశిధర్‌రెడ్డి, విజయ్‌కుమార్, చంద్రశేఖర్, సుబ్రమణ్యాచారి, కేవీకే శాస్త్రవేత్తలు రమేష్‌నాయక్, మహదేవయ్య, అపర్ణ, తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఆర్థికంగా ఎదగాలి



కంబాలపాడు చెరువును పరిశీలిస్తున్న జేడీఏ వరలక్ష్మి, తదితరులు

కృష్ణగిరి: ప్రభుత్వం రైతాంగానికి అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని జేడీఏ పి.వరలక్ష్మి సూచించారు. మండల పరిధిలోని కంబాలపాడు గ్రామంలో చెరువును ఆమె బుధవారం అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ పరివర్తన పథకం కింద రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. సాగునీటి వసతి కలిగిన గ్రామాల్లో ఈ పథకం కింద వ్యవసాయ పరికరాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే రైతులు సంఘాలుగా ఏర్పడితే స్టార్ యూత్ అసోసియేషన్ అనే ఎన్జీఓ సంస్థ ద్వారా రైతులకు ఉపయోగపడే పరికరాలు అందిస్తామని తెలిపారు. అనంతరం రైతులకు ఈ పథకంపై ఆర్‌డీసీ ఏఓ నాగేశ్వరమ్మ, అల్లీపీరా శిక్షణ ఇచ్చారు. ఏఓ వెంకటేశ్వర్లు, ఏఈఓ రాజేష్, ఎన్‌జీఓ సిబ్బంది లక్ష్మి, అన్ని ఆర్‌బీకేల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.